# మత్స్యకారులు, యాదవులకు పెద్దపీట

- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- సామూహిక భవనాలకు భూమిపూజ
- మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ
- కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ



సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ముదిరాజులతో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 6 : మత్స్యకారులు, యాదవులకు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం పెద్దపీట వేసిందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్తకోట రహదారిలో రూ.2కోట్లతో మత్స్యకారుల భవ నం, గోపాల్‌పేట రోడ్డులోని బాలానగర్‌లో రూ.2కోట్లతో యాదవ సంఘం భవన నిర్మాణాలకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలకు సర్కారు అండగా ఉందని, మత్స్యకారుల అభివృద్ధి కోసం ఉచిత చేపపిల్లల పంపిణీ, సబ్సిడీ వాహనాల అందజేత, గొల్ల కురుమలకు గొర్రె పిల్లల పంపిణీ, పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే సీఎం కేసీఆర్ అభిలాష అన్నారు. మత్స్యకార, యాదవ భవనాలను అద్భుతంగా నిర్మించాలని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, నందిమల్ల శ్యాం భువనేశ్వరి, నాయకులు సుబ్బు, గిరయ్య తదితరులు ఉన్నారు.

### ఆర్వో ప్లాంట్ ప్రారంభం

వనపర్తి టౌన్, అక్టోబర్ 6 : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు మురళీధర్, శారద దంపతులు బహూకరించిన తాగు నీటి ఆర్వో ప్లాంట్‌ను మంత్రి నిరంజన్‌రెడ్డి కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.లక్షా 35వేలతో శుద్ధజల ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన వైద్య దంపతులను పూలమాల, శాలువాతో సన్మానించారు.

### బతుకమ్మ చీరల పంపిణీ..

సీఎం కేసీఆర్ ఆడపడుచుల దసరా కానుకను అందిస్తున్న బతుకమ్మ చీరలను జిల్లా కేంద్రంలోని 18వ వార్డులో మహిళలు, వృద్ధులకు మంత్రి నిరంజన్‌రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు సంతోషంగా ఉండాలని సీఎం కేసీఆర్ చీరలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఈవో నరహరి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ లక్ష్మయ్య, మార్కెట్ చైర్మన్ రమేశ్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, వార్డు కౌన్సిలర్ గంధం సత్యమ్మ, శరబంద, లక్ష్మీనారాయణ, నాగన్న ఉన్నారు.

## కొండానుఆ దర్శంగాతీసు కోవాలి

పెద్దమందడి, అక్టోబర్ 6 : తెలంగాణ స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గట్ల ఖానాపూర్‌లో యాదవ కమ్యూనిటీ హాల్ ప్రారంభించి అనంతరం మోజర్ల గ్రామ శివారులో ఉన్నటువంటి కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల ఆవరణలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1967 బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వంలో తెలంగాణ గురించి చర్చకు వచ్చిన సందర్భంగా తెలంగాణపై హేళనగా మాట్లాడితే తన మంత్రి పదవికే రాజీనామా చేశారని గుర్తు చేశారు. మూడు తరాలకు సంబంధించి ఉద్యమంలో పనిచేసిన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అని తెలిపారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీసీ నీరజాప్రభాకర్, కళాశాల డీన్ సైదయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, రాజాప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన ముదిరాజ్‌లు

గోపాల్‌పేట, అక్టోబర్ 6 : మండలంలోని జయన్నతిరుమలాపురంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముదిరాజులు 60మంది శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త బీఆర్‌ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి సహకరించాలని, మరోసారి సీఎం కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రైతుబంధు సమతి మండలాధ్యక్షులు తిరుపతియాదవ్, గ్రామాధ్యక్షుడు గోపాల్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, ముదిరాజుల సంఘం గ్రామాధ్యక్షుడు రాజు, బీఆర్‌ఎస్ నాయకులు కోటేశ్వర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కోదండం, రాము తదితరులు పాల్గొన్నారు.

# మోదీ.. రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ?

- కులం,మతం పేరిట యువతను రెచ్చగొట్టేందుకు కుట్రలు
- తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే విద్య, ఉద్యోగ అవకాశాలు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థులు

పాలమూరు, అక్టోబర్ 6 : దేశవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో ప్రధాని మోదీ విఫలమయ్యారని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ 2014 ఎన్నికలకు ముందు ప్రకటించారని, ఆ హామీ ఏమైందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మోదీని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌కు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు శుక్రవారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. మెట్టుగడ్డ నుంచి ప్రారంభమైన ర్యాలీలో పదివేల మందికి పైగా విద్యార్థులు పాల్గొని తెలంగాణ చౌరస్తా వరకు నిర్వహించగా ఈ సందర్భంగా థ్యాంకూ సీఎం సార్, థ్యాంకూ శీనన్న అన్న నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనలో విఫలమైన బీజేపీ నాయకులు కులం,మతం పేరిట యువతను రెచ్చగొట్టి ఓట్లు కొల్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని, పొరపాటున కూడా యువత వారి మాయలో పడొద్దని సూచించారు. యాదాద్రి, మన్యంకొండ లాంటి అనేక ఆలయాలను తెలంగాణ ప్రభుత్వం అద్భుతంగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. గూగుల్, ఆపిల్‌లాంటి ప్రఖ్యాత కంపెనీలకు తెలంగాణకు తీసుకొచ్చి రాష్ట్ర యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగాలను కల్పిస్తోందని, మహబూబ్‌నగర్ లాంటి ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ కంపెనీలను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగాలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో వచ్చిన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ద్వారా స్థానికంగానే నాణ్యమైన ఉచిత ఇంజినీరింగ్ విద్య చదివి ఇక్కడే పెద్దపెద్ద ఐటీ ఉద్యోగాలు చేసుకోనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. 70 ఏండ్లలో ఒక్క ఇంజినీరింగ్, మెడికల్ కళాశాల కూడా తీసుకురాలేని వారు ఇప్పుడు ఎన్నికల వేళ మాయమాటలు చెప్పేందుకు ప్రజల వద్దకు వస్తున్నారని వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశంలోనే అత్యధిక పంటలు పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని, త్వరలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మొత్తం సాగులోకి వచ్చేలా కృషి చేస్తామని ప్రకటించారు. అదేవిధంగా అత్యధిక పరిశ్రమలను తీసుకువచ్చి స్థానికంగానే యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని విద్యార్థులకు వివరించారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటానికి విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్వీ నాయకులు శివ, నాని, సత్యపాల్, మనీశ్‌గౌడ్, పవన్, వినయ్, సాయి, శ్రీకాంత్‌తోపాటు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు

హన్వాడ, అక్టోబర్ 6 : కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలను నమ్మి మోసపోతే మళ్లీ అరిగోస పడతామని, ప్రజలు వారితో జాగ్రత్తగా ఉండాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట, దాచక్‌పల్లి, టంకర, గుడ్డిమల్కాపురం, రాంనాయక్‌తండా, బుద్ధారం, కారంతండా, హన్వాడ, సల్లోనిపల్లి గ్రామాల్లో రూ.18కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



జీపీ భవనానికి శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

# కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు

- మార్కండేయ రిజర్వాయర్‌తో సాగు, తాగునీరు
- పదేండ్ల ప్రస్థానం పాదయాత్రలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి, అక్టోబర్ 6 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెసోళ్లు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పదేండ్ల ప్రస్థానంలో భాగంగా శుక్రవారం బిజినేపల్లి మండలంలోని ఊడ్గులకుంట తండా, కీమ్యాతండా, పెద్దతండా, వసురాంతండా, పోలేపల్లి, బోయపూర్, బిజినేపల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెసోళ్లు చెప్పే మాయమాటలు నమ్మవద్దని సూచించారు. కేఎల్ఐ ద్వారా సాగునీరు అందని గ్రామాలు, తండాల రైతుల పంట పొలాలకు నీటిని అందించేందుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడి రూ.100 కోట్ల వ్యయంతో మార్కండేయ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టమన్నారు. ఈ రిజర్వాయర్‌ను ఈనెల చివరిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీంతో 17 తండాలు, 5 గ్రామాల రైతు పొలాలకు సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. గతంలో తండాల ప్రజలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేవారని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పలు తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధి చేశారన్నారు. బిజినేపల్లి మండలంలో గిరిజన తండాలు ఎక్కువగా ఉండడం వల్ల త్వరలో తండావాసులకోసం గిరిజన గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతంతో సాగు, తాగునీరు లేక ఎంతో ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం రైతులకు 24 గంటల కరెంటు, రైతుబీమా, రైతుబంధు ఇవ్వడం జరుగుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించి వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్మయ్య, పులేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బాలరాజుగౌడ్, విజయ్, బాలస్వామి, శంకర్‌నాయక్, రవినాయక్, మంగ్లి, బోజ్యానాయక్, అంజి, లిమ్యానాయక్, అశోక్, వెంకటయ్య, శ్రీను, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 6 : తెలంగాణలో పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 25వ వార్డు అంబేద్కర్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.30 లక్షల వ్యయంతో సర్వహంగులతో హాల్ నిర్మాణం చేపట్టామన్నారు. పేదల వివాహ శుభకార్యక్రమాలు జరుపుకోవాలనే సంకల్పంతో కమ్యూనిటీ హాల్ నిర్మించామన్నారు. పట్టణంలోని ప్రతివార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చామన్నారు. పట్టణ ప్రకృతి వనాలు, వైకుంఠధామాలను నిర్మించామన్నారు. గద్వాల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం గద్వాల పట్టణ రూపురేఖలే మారిపోయాయన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్, తనను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం జిల్లా కేంద్రం నుంచి అయిజకు వెళ్లే రహదారి మరమ్మతుల్లో భాగంగా చేపట్టిన బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పూజ చేసి ప్రారంభించారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులైన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 500 మందికి పైగా కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, జములమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సతీశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 4,5 వార్డులకు చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, మహిళలు బీఆర్‌ఎస్‌లోకి చేరగా, ఎమ్మెల్యే గులాబీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప ఉన్నారు.